# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, మంగళవారం 27 మే 2025 | HYDERABAD




సోమవారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో సందడి చేసిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు



సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వీధి వ్యాపారులు

# బకాయిలు చెల్లిస్తేనే!

## వైద్య పరికరాలు సరఫరా చేస్తాం

*కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాలు అస్తవ్యస్తమయ్యాయని, ఆ కోవలోకి వైద్యరంగమూ చేరిందన్న విమర్శలొస్తున్నాయి. కీలకమైన వైద్యరంగాన్ని విస్మరిస్తుండటంతో పేద ప్రజలకు సర్కారు వైద్యం దూరమయ్యే అవకాశమున్నది. హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పెద్దాసుపత్రులకు సరఫరా చేసే పరికరాలు, మందుల పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడంతో ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లైయర్స్.. ప్రభుత్వాసుపత్రుల్లో పరికరాల సరఫరాను మార్చి నుంచే నిలిపేసినట్లు తెలిపారు. బతిమాలినా కూడా రూ.42 కోట్ల బకాయిలు విడుదల చేయడంలేదు. దీంతో మార్చి నంచి చేసేదేమీ లేక సరఫరా నిలిపేశారు. ప్రభుత్వ తీరుతో పేదలు ఇబ్బందులుపడాల్సి వస్తున్నది. మందులు, చికిత్స పరికరాల కోసమని ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు.*

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలో ఉన్న ప్రభుత్వ పెద్దాసుపత్రులకు ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లైయర్స్ అసోసియేషన్‌కు చెందిన 35 మంది సప్లైయర్స్ నిత్యం సర్జరీ పరికరాలు, డయాగ్నోస్టిక్ పరికరాలు, మెడిసిన్ సరఫరా చేస్తుంటారు. వారు సరఫరా చేసేవాటిల్లో గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, పేట్లబుర్జ్, సుల్తాన్‌బజార్ మెటర్నిటీ ఆసుపత్రి ఉండటం గమనార్హం.ఆ ఆసుపత్రులకు సూపర్‌స్పెషాలిటీ స్థాయి పరికరాలను సరఫరా చేస్తున్నారు. వాటిల్లో ప్రధానంగా ఆర్థోపెడిక్, న్యూరో, ప్లాస్టిక్ సర్జరీ ఇంప్లాంట్స్, కార్డియాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, డెంటల్ చికిత్సలకు అవసరమైన పరికరాలతో పాటు డయాగ్నోస్టిక్ డిస్పెన్సరీ కిట్లు, మందులు ఉన్నాయి. అయితే వీటన్నింటికి చెల్లించాల్సిన బకాయిలు సకాలంలో చెల్లించకుండా విస్మరించడంతో రూ.42కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో గాంధీ రూ.15 కోట్లు, ఉస్మానియా రూ.11కోట్లు, నిలోఫర్ రూ.13కోట్లు, పేట్లబుర్జ్ రూ.2కోట్లు, మెటర్నిటీ ఆసుపత్రి రూ.1 కోటి చొప్పున సరఫరాదారులకు చెల్లించాల్సి ఉంది. అవి మొత్తం కలిపి నేటికి రూ.42కోట్ల పెండింగ్ బకాయిలుగా మిగిలాయి. వాటిని చెల్లించాలంటూ సరఫరాదార్లు అనేకసార్లు విన్నవించుకున్నా కూడా పట్టించుకునే నాథుడు లేడు. పేదప్రజల ప్రాణాలు కాపాడే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరఫరా నిలిపేయడం ఇష్టం లేక ఇన్ని రోజులు ఓపికతో ఉన్నారు. కానీ నేడు అప్పులు పెరగడం మూలంగా సరఫరాదారులు ఇబ్బందులు పడుతున్నారు. అందుకే ఈ ఏడాది మార్చి నుంచి సరఫరా నిలిపేశారు. అపరాత్రైనా, అర్ధరాత్రైనా కూడా అత్యవసర సమయాల్లో అసవరమున్న పరికరం, మెడిసిన్ అందించారు. టీజీఎంఎస్ఐడీసీ లో లేని మందులను కూడా

మిగతా IVవ పేజీలో





**బకాయిలు పేరుకుపోవడంతో సామగ్రి నిలిపివేత**

- ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రుల్లో విచిత్ర పరిస్థితి
- మార్చి నుంచి సరఫరా నిలిపివేశాం
- ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లైయర్స్ అసోసియేషన్ స్పష్టీకరణ

### బకాయిలు చెల్లించండి..

పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించకుండా మమ్మల్ని ముప్పు తిప్పలు పెడుతున్నారు. అందుకే మార్చి నుంచి సరఫరా నిలిపేశాం. ఇప్పటికైనా ప్రభుత్వం మా పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి. పేదప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ఇన్నిరోజులు ఆలస్యమైనా పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు మాత్రం చెల్లించాల్సిందే.

- కేబీ రామచంద్ర, ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లైయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు



# ఈ ప్రభుత్వంలో మేం బతకలేం!

## రోజూ రూ.500లు సంపాదించే చోట రూ. 1000 జరిమానాలు ఎట్లా కట్టాలె

- జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో వీధి వ్యాపారుల ఆందోళన


**సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ):** ట్రాఫిక్ పోలీసుల వేధింపుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ వీధి వ్యాపారులంతా జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో సోమవారం ఉదయం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. నేషనల్ హాకర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దాదాపు నాలుగు గంటల పాటు నగరం నలుమూలల నుంచి తరలి వచ్చి నిరసన ప్రదర్శన చేపట్టారు. సొంతంగా చిరు వ్యాపారం చేసుకుంటున్న తమపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో మాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవనోపాధి పొందామని, ఈ ప్రభుత్వంలో తాము బతకలేని పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు..

రోజూ పని చేసుకుంటూ రూ.500, రూ.1000 వచ్చే షాపులకు వేలకు వేలు ఫైన్లు వేస్తుండటం ఎంత వరకు సమంజసమని ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మీర్ ఇనాయత్ అలీ బాక్రీ ప్రశ్నించారు. ఆపరేషన్ రోప్ పేరుతో ట్రాఫిక్ పోలీసుల వేధింపులు అన్నీ ఇన్నీ కావని, ఆక్రమణల పేరుతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పార్కింగ్ లేని బడా హోటళ్ల జోలికి వెళ్లకుండా చిన్న వ్యాపారస్తులను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. పెట్టి కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, జీహెచ్‌ఎంసీ గుర్తింపు కార్డులు ఇచ్చినప్పటికీ తమకు జీవనోపాధి లేకుండా పోతున్నదని వాపోయారు. స్ట్రీట్ వెండర్ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీధి వ్యాపారుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పీఎం సురక్ష భీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, శ్రమయోగి మందన్ పింఛన్ యోజన, మాతృవందన యోజన, జననీ సురక్షణ యోజన, జన్‌ధన్ యోజన, వన్ నేషన్ వన్ కార్డు తదితర పథకాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా అమీర్‌పేట, సికింద్రాబాద్, కోఠి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వీధి వ్యాపారులంతా ప్రజావాణి వేదికకు వెళ్లి అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్‌కు వినతి పత్రం సమర్పించారు.

# విదేశాల నుంచి వచ్చారా..

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): దేశంలో మరోసారి కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వ్యాపిస్తున్న వేరియంట్ వల్ల పెద్ద ప్రమాదం లేకపోయినప్పటికీ ప్రజలు జాగ్రత్తలు పాటించడం మంచిదంటున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణలు, వృద్ధులు జాగ్రతగా ఉండాలన్నారు. కేరళ, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో కేసులు పెరుగుతుండడం, థానే ప్రాంతంలో ఓ యువకుడు, బెంగళూరులో 84 ఏండ్ల వృద్ధుడు మరణించడంతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. విదేశీ ప్రయాణాలతో పాటు కరోనా కేసులు అధికంగా ఉన్న ప్రాంతాలకు వెళ్లి వచ్చిన వారు లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దని, వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రంలో కరోనా పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పాజిటివ్ నిర్ధారణ జరిగిన వారు జనావాసాల మధ్య తిరగకుండా స్వీయ ఐసొలేషన్‌లో ఉంటూ వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని గ్రేటర్ వైద్యాధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.





సచివాలయం రోడ్డులో జోరు వాన

# నేడు మోస్తరు వాన..

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసాయి. సోమవారం రాత్రి 9గంటల వరకు బహుదూర్‌పురాలోని సులేమాన్‌నగర్‌లో 1.60సెం.మీలు, రాజేంద్రనగర్‌లో 1.55సెం.మీలు, పటాన్‌చెరులో 1.33సెం.మీలు, గచ్చిబౌలి, ఖాజాగూడలో 1.23సెం.మీలు, అత్తాపూర్‌లో 1.20సెం.మీలు, షేక్‌పేట, బంజారాహిల్స్‌లో 1.0సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా కొనసాగుతున్న ద్రోణి కారణంగా రాగల 24గంటల్లో నగరంలోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.





అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న మాజీ మంత్రి మహమూద్ అలీని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

IVలో


# 6న మహాగణపతి అంకురార్పణ



ఖైరతాబాద్, మే 26 : ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠాపనకు అంకురార్పణ జరుగనున్నది. జూన్ 6న నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కర్ర పూజ క్రతువు నిర్వహించనున్నారు. మహాగణపతి ప్రతిష్ఠాపనోత్సవం 70 ఏండ్లు పూర్తి చేసుకొని ఈ ఏడాది 71 వసంతంలోకి అడుగుపెడుతోంది. ఖైరతాబాద్ చౌరస్తాలో నిర్వహించే ఈ వేడుకకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్‌కుమార్ కోరారు. కాగా, గతేడాది గణేశ్ ఉత్సవ కమిటీ నుంచి కొందరు సభ్యులు వేరుగా కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఉత్సవాల ఏర్పాటులో తమకు భాగస్వామ్యం దక్కడం లేదంటూ.. ఆరోపిస్తూ గొడవకు సైతం దిగారు. ఉత్సవ కమిటీ ఆవిర్భావం తామే చేశామని, దానికి పూర్తి హక్కుదారులు తామేనంటూ దివంగత చైర్మన్ వారసులు చెబుతుండగా, అనేక ఏండ్లుగా తాము కూడా ఉత్సవాల్లో భాగస్వామ్యం వహిస్తున్నామని, కమిటీ సభ్యులుగా ఉన్నామని, కానీ ఒకే కుటుంబం ఆ బాధ్యత ఎలా తీసుకుంటుందని కొత్తగా ఏర్పడిన కమిటీ ప్రశ్నిస్తోంది. కర్రపూజ కోసం రెండు కమిటీలు పోటీ పడుతాయా, లేక సమన్వయం పాటించి భక్తుల మనోభావాలను గౌరవిస్తాయా అనేది వేచిచూడాల్సిందే.

# పది సప్లిమెంటరీ గట్టెక్కేదెలా?

## ఫెయిలైన విద్యార్థులపై పర్యవేక్షణ ఏదీ?



సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షలు రాసి ఫెయిలైన విద్యార్థులు ఇప్పటికే కొంత మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. అలాంటి విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షల్లో విజయం దక్కేలా చొరవ చూపాల్సిన ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. ఏ సబ్జెక్టుల్లో విద్యార్థులు ఫెయిలయ్యారో వాటిలో పాసయ్యేలా సంబంధిత అంశాలపై బోధించాలి. కానీ ఆ దిశగా అధికారులు అడుగులు వేయడం లేదు. 2024-25 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకొని మార్చిలో జరిగిన పదో తరగతి వార్షిక పరీక్షల్లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో కలిపి మొత్తం 19,125 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 8,266 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాసుకాలేదు. ఇందులో చాలా మంది గణితం, సైన్స్, ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, హిందీలో అత్యధికంగా ఫెయిల్ అయ్యారు. కాగా, గణితం, ఇంగ్లిష్‌కు ట్యూషన్ చెప్పాల్సిన అవసరం ఉందని విద్యార్థులు చెబుతున్నారు. కలెక్టర్ స్పందించి ఈ వారం రోజులకైనా గణితం, ఇంగ్లిష్ లాంటి సబ్జెక్టులపై బోధన చేయించాలని కోరుతున్నారు. కాగా, జూన్ 3 నుంచి 13 వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే.

# ఫ్రెండ్స్‌తో ఆడుకుంటాం.. పార్కు కావాలె




ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన చిన్నారులు

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులు అర్జీలను స్వీకరిస్తున్న క్రమంలో మూసాపేట నుంచి ఇద్దరు చిన్నారులు వచ్చారు. తమకు పార్కు కావాలంటూ..అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. మూసాపేటలో పిల్లలు ఆడుకోవడానికి ఒక్క పార్కు కూడా లేదని, అంజయ్య నగర్‌లో ఉన్న పార్కు స్థలాన్ని కొందరు కబ్జా చేశారని చిన్నారులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ పార్కును అభివృద్ధి చేసేందుకు గతంలో రూ.50 లక్షలు మంజూరు చేశారని, నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ఆగిపోయాయని, వెంటనే పనులు ప్రారంభించాలని విన్నవించారు. 'మేమంతా ఫ్రెండ్స్‌తో కలిసి పార్కులో ఆడుకుంటామం'టూ ఆ చిన్నారుల అధికారుల ఇచ్చిన వినతిపత్రంలో వివరించారు.

# మా బడికి దారి చూపండి

## దూద్ బావి పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ధర్నా

అడ్డగుట్ట, మే 26: చిలకలగూడ దూద్ బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అడ్డుగా అక్రమంగా నిర్మించిన గోడను తొలగించి.. బడికి బాటను ఏర్పాటు చేయాలంటూ బల్దియా సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం ఎదుట సోమవారం ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి ధర్నాకు దిగారు. పాఠశాలకు దారి లేకపోవడంతో సుమారు 100 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన చెప్పారు. విషయాన్ని ఎన్ని సార్లు టౌన్ ప్లానింగ్ అధికారులకు విన్నివించినా.. పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దారి లేకపోవడంతో పాఠశాలలో విద్యనభ్యసించేందుకు చేరే విద్యార్థులు వెనకడుగు వేస్తున్నారన్నారు. సీఎం ప్రత్యేకంగా చొరవ తీసుకొని.. విద్యార్థుల బాధను దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనంత త్వరగా పాఠశాలకు దారి ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని, కానీ బాటలేని మా పాఠశాలకు బాటను ఏర్పాటు చేస్తే ఎంతో బాగుంటుందన్నారు.



### ధర్నాకు సంఘీభావం..

పాఠశాలకు దారిని ఏర్పాటు చేయాలని జోనల్ కార్యాలయం ముందు ధర్నాకు దిగిన ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ రెడ్డికి సీపీఐ సికింద్రాబాద్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ నాయకులు కంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మాటల్లో చెప్పేదొకటి చేతల్లో చేసేదొకటిగా ఉందని మండిపడ్డారు. పాఠశాలకు దారి లేకపోవడంపై అధికారులు, పాలకులు స్పందించకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సరాలుగా పాఠశాల పరిస్థితి తెలిసిన అధికారులు కావాలని ఈ సమస్యను విస్మరిస్తున్నారని ఆరోపించారు. బడిబాట కార్యక్రమంలో కూడా ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలను ఇచ్చి అందులో 20 హామీలను కూడా అమలు చేయలేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంలో సిగ్గుపడాలన్నారు.




ప్లకార్డుతో ధర్నా చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ రెడ్డి